కథానిక

# ★ పరాజితయైన పార్వతి ★

పోగుల వెంకటేశ్వరరావు

కొంతమంది వ్యక్తులు తమ జీవితరథం ఏవిధమైనటువంటి ఆటంకములనూ ఎదుర్కొనవలసిన పని లేకుండా సాఫీగా సాగిపోతుందని తలపోసి మనస్సులో పెద్దపెద్ద సౌధాలను నిర్మించుకుంటారు. కడకు ఆ మేడమీదనుంచి అకస్మాత్తుగా గెంటివేయబడతారని గాని లేక స్వయంకృతాపరాధం వల్లనే ఆ భవనంమీద నుండి క్రిందకు పడద్రోయబడతారని గాని లేశమాత్రమైనా వారి గ్రహింపుకు రాదు. భావవీధుల్లో ఎంత హాయిగా విహరిస్తారో, వాస్తవ వీధుల్లో అంత నికృష్టమైన బ్రతుకు గడపవలసి వుంటుంది. ఇలాంటి మనుషుల్లో పార్వతిని గురించి ముఖ్యంగా చెప్పుకోవచ్చు.

సుబ్బారావును భర్తగా బడసినందుకు, ఆమె జీవితం సౌభాగ్యంతో, చక్కలిగింతలతో నవ వసంతశోభతో ప్రవహించుతుందని అభిప్రాయపడ్డది. తన అదృష్టదీపికకు మురిసిపోయి విధిని వేనోళ్ళ కొనియాడింది. లోకానికంతటికీ ఆదర్శంగా తమ దాంపత్యజీవితం నిలబడుతుందని, ముందుముందు మహిళలందరికీ తన జీవనజ్యోతి వెలుగు చూపించుతుందనీ పార్వతి ఆశించింది. ఆమె ఆశాలత ఆకాశంవరకూ ఎగబ్రాకి క్రొత్త చిగుళ్ళతో పుష్పించింది.

కాని కాలచక్రం ఒకటి రెండుచుట్లు తిరిగిన వ్యవధిలోనే భయానకమైన వాస్తవాన్ని ఆమె చూడవలసి వచ్చినందుకు క్రుంగి కృశించిపోయింది. తనను పువ్వుల్లో పెట్టి పూజిస్తాడనుకున్న భర్త వాడిపోయిన పూవువలె తనను విసిరేస్తున్నాడు.

పార్వతి ఎదుర్కొనవలసి వచ్చిన కష్టం 'స్త్రీ జాతి'కి సహజమైనదేనని అంగీకరించక తప్పదు. అయినా పరమపద సోపానం అధిష్ఠించాలనే మధుర వాంఛతో ఆమె జీవితయాత్ర ప్రారంభించింది గనుక మధ్యలో పాములు కరవటం, క్రిందకు దిగజారిపోవడం వల్ల ఆమె నిస్పృహ చెందింది.

తిరిగి తన గమ్యస్థానం చేరుకునేందుకై ఆమె నిచ్చెనలకోసం వెదక నారంభించింది.

తన కళ్ళఎదుట భర్త పరాయి స్త్రీని ప్రక్కనే పదిలంగా కూర్చొనబెట్టుకుని సరస సల్లాపాల్లో మునిగి తేలుతూంటే తను ఉపేక్షించి-అనగా పరోక్షంగా ఆమోదించి-. వాళ్ళకు కష్టం కలిగించకుండా సేవచేయడమే సంఘంలో పతివ్రతలు ఆచరిస్తున్న ధర్మమా? అదేనా ధర్మపత్ని లక్షణం అనిపించుకునేది?

తన స్థానాన్ని బలాత్కారంగా ఆక్రమించుకుని అధికారం చలాయించుతూ తనపట్ల దయాదాక్షిణ్యాలు విడనాడి నాష్టికంగా అరుస్తూ కోలాహలం చేస్తూన్నా సే, ఆ తెలియని 'తీపి' కొద్దీ భర్త మౌనం సహించాడు సరే. మరి తనేం చెయ్యాలి? నోరు లేని వాజమ్మలాగ ఆ తుచ్ఛమైన వ్యక్తి పాదాలను మోకరించి బ్రతిమాలాడి భంగపడటమే ఉత్తమతరగతి గృహలక్ష్మి అనుసరించదగిన విధానమా?

తన శక్తిని వినియోగించుకునే ప్రయత్నం తలపెట్టకుండా తాను ఆదికాలంనుంచీ వొస్తూన్న 'అబల' అని తీర్మానించుకుని 'విధి' అన్న ఒకకొని తెచ్చుకున్న వస్తువును దాసోహమని, దారి చూపించమని మాయదారి దేవుణ్ణి ప్రార్థించుతూ తులసికోట చుట్టూ తిరిగి జపం చేస్తే, చిన్నప్పటి నుంచీ చదువుకుంటూన్న కథల్లోని అనసూయ, సక్కుబాయి ఇత్యాది చరిత్రలో సహా తారా పథాన్ని అందుకోగలదా?

చదువుకున్నవాడు, సంస్కారం గలవాడు, ఉచితానుచితాలను మీమాంస చేయగలవిజ్ఞానం కలవాడు ఏనాటికైనా సరే గతజల సేతుబంధనం జరిపి తాను చేసిన మోసానికి పశ్చాత్తాపపడి, తన చంచల మానసిక పరివర్తనను తెనంతట

తానొచ్చుకుని సంసారం స్వర్గంలోకి అడుగు పెట్టకపోతాడా అన్న ధీమాతో ప్రతిఘటన ఉద్దేశానికి స్వస్తివాచకం చదివి, తిరుపతి వెంకటేశ్వరస్వామి వారికి ఒక చిలుము కాని ముడుపు కట్టుకుని ముందుకు చూస్తే కొండమీదకు చేదుకోకపోతాడా?

తలుపు దగ్గరగా వేసుకుని మంచంమీద పడి వున్నది పార్వతి. చుట్టూ గోడల మీదకు శూన్యంగా చూస్తూ రెప్ప వాల్చడం లేదు. కలతచెందిన ఆమె మనస్సుకు గోడలమీద రకరకాల బొమ్మలు ఆడుతూన్నవి—భర్త ప్రియురాలి తలను బుజానికానించుకుని ముంగురులు నిమురుతున్నాడు. పార్వతి శరీరం దహించుకు పోయింది. సుబ్బారావు వనజాక్షి చేతులు పుచ్చుకుని సముద్రపుటొడ్డున ఇసుకతిన్నెలపై విహరిస్తున్నాడు— పక్కన సముద్రంలోని హోరు మనే శబ్దం కంటే మించి పార్వతి హృదయం ఘోష పెట్టింది. వొడ్డుకు తాకిన అలలు సన్నని నీటితుంపురులను విదజల్లుతూ ఆ ప్రేమీ ప్రేమికులను అక్షింతలతో ఆశీర్వదిస్తున్నవి—పార్వతి ఆ సముద్రపు కెరటాల్లో తాను కొట్టుకుపోతూన్నట్టుగా అనుభవించింది.

పరిసర ప్రాంతాల్లో సందడి తగ్గిపోయింది. గోడమీద గడియారం లెక్కకు పదకొండు పర్యాయములు టక్కున మోగింది. పార్వతి గుండెల్లో నిర్విరామంగా పని చేస్తూన్న కొలిమి తిత్తులు బరబరా గాలి విసురుతూ మంటలకు రేకెత్తిస్తూన్నవి.

తలుపు నెట్టుకుని ఎవరో లోపలకు ప్రవేశించుతూన్నట్టు అడుగుల చప్పుడు వినిపించింది. అలికిడికి త్రుళ్ళిపడి లేచి ఆదుర్దాగా వాకిలివైపు చూసింది పార్వతి. అర్ధరాత్రివేళ పార్వతి ఇంట్లో ధైర్యంగా జొరబడే అర్హత ఎవరికుంటుందో? అతనే వొచ్చాడు. సుబ్బారావు గదిలోకి అడుగు పెడుతూనే మొహంలో పెద్ద అక్షరాల్లో 'విసుగు'ను వ్రాసిపెట్టి వుంచాడు. పిల్లి మెడలో గంట కట్టుదామని సమావేశం జరిపిన ఎలుకల సామెతగా పార్వతి పరుగెత్తకపోయినా, మనస్సులోని ఆలోచనలు మాత్రం వెనుదిరిగి చూడకుండా మరీ వెన్ను చూపినవి. సుబ్బారావు షర్టు విప్పి వొంకెకు తగిలించుతూ భార్యవంక ఓ కంటి చూపు పారేశాడు—తన రాకకోసం నిరీక్షిస్తున్నట్టు కనుపించిన భార్యను చూచి, అతని ఆత్మగౌరవానికి ఇంతవరకూ ఏమాత్రం భంగం వాటిల్లలేదని సంతృప్తి చెందాడు. కాని ముఖ కవళికల్లో మార్పు ఏమీ వెల్లడి చేయలేదు. కళాకాంతీ లేక దీపపు శెమ్మెలాగు నిలబడ్డాడు!

పార్వతి హృదయంలో సమ్మెట ప్రేటులు క్రమంగా సన్నగిల్లిపోతూన్న సూచనలు పొడసూపినవి. భర్తను చూడగానే గుండెలమీద కుంపటి తొలగిపోయినట్టుగా తయారైంది.

ఆమె ఆశగా సారించిన ప్రణయ దృక్కులను అతను నిర్లక్ష్యంగా తృణీకార భావంతో సమాధాన మిచ్చాడు. పార్వతి దగ్గరగా వెళ్ళి చల్లని మంచినీళ్ళు ఆప్యాయంగా అందించితే 'టేబిలు మీద పెట్టు' అని అతను దూరంగాజరిగి భగ్గున నిప్పుపుల్ల మండించి సిగరెట్టు వెలిగించేసి తుపుక్కుమని ఊదేశాడు. ఆమె చిరునవ్వుతో పెదిమలను కదిలించితే అతను కంటితో పెదిమను కొరికాడు. మృదువుగా ఆమె మాట్లాడింది. కటువుగా అతను జవాబిచ్చాడు. సంభాషణ పొడిగించి స్వాధీనం చేసుకోవాలని ఆమె వుద్దేశం. ఎక్కడికక్కడ తెగ్గొట్టేస్తే పీడ వొదిలిపోతుందని అతని నిర్ణయం.

ప్రపంచాని కంతటికీ వెలుగు చూపించగలననుకొన్న పార్వతి ఆ చిన్న గదిలో నాలుగు గోడలమధ్య పరాభవం పొందినదై ఎటూ పాలుబోక నలుదిక్కులూ కలయజూచింది.

'ఛీ బుద్ధిలేదూ?' - సుబ్బారావు కాదు ఈ మాటలన్నది: ఆమెను వెంట తరిమి వొస్తున్న నీడయే వెక్కిరించింది.

'మానవజన్మ ఎత్తావుగాని సిగ్గూ శరమూ లేని బ్రతుకు ఎందుకు? గోడమీద ఫొటో గేలి చేసింది.

'నేను పుట్టి పెరిగిన వాతావరణం, నా చుట్టూ ప్రపంచం నన్నీ విధంగా తీర్చి దిద్దింది. నా నైజాన్ని మార్చుకోలేక పోవడమేగా నేం చేసిన తప్పు? ఏం చేసేది మరి?' అనాలోచితంగా సమాధానం చెప్పుకున్నది పార్వతి.

'అయితే నీగతి ఇంతేలే పో' అని వెంటనే బదులు పలికింది అంతరాత్మ.